




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 21-4-2025


సంపుటి: 21 సంచిక: 23

పేజీలు: 8 వెల: రూ.1


- జలవనరుల శాఖలో రెండు దశాబ్దాలుగా తిరుమలేశుని హవా
- ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆయనదే పెత్తనం
- అదనపు బాధ్యతలతోనే ఇన్నాళ్లూ అధికార జులుం
- తోటి అధికారులను బలి చేసే ఉన్నత స్థానానాకి
- ఇటీవల ఎస్ఈగా పదోన్నతి.. త్వరలో సీఈ అవుతారని ప్రచారం



కొట్టుకుపోయిన రెల్లిగెడ్డ ఆనకట్ట




రెల్లిగెడ్డ ఆనకట్ట క్వాలిటీ భేష్ అంటూ డోల ఇచ్చిన సర్టిఫికేట్ ఇదే

# అక్రమాలకే సర్టిఫికేషన్

# డోలవారికి ప్రమోషన్!

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఆయన జలవనరుల శాఖ ఎస్ఈగా ఇటీవలే ప్రమోషన్ అందుకున్నారు. ఈ మాట విని ఉత్తరాంధ్రలో చాలామంది విస్తుపోతున్నారు. ఎందుకంటే.. రెగ్యులర్ ఎస్ఈ కాకముందే ఆ హోదా వెలగబెడుతూ ఉత్తరాంధ్ర స్థాయిలో కొన్నేళ్లుగా ఆయన వెలిగిపోతున్నారు. 2005 నుంచి 2024 జూలై వరకు దాదాపు రెండు దశాబ్దాల పాటు ఉత్తరాంధ్ర పరిధిలో జలవనరుల శాఖపై పెత్తనం చెలాయిస్తూ తన మాట వినని అధికారులను, సిబ్బందిని వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ పెద్దల ప్రాపకంతో తన హోదాను కాపాడుకుంటూ అనేక అక్రమాలకు పాల్పడిన అధికారిగా ముద్రపడిన డోల తిరుమలరావుకు రెగ్యులర్ ఎస్ఈగా ప్రమోషన్ ఇవ్వడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. పదోన్నతికి ఆయన అర్హుడు కాదా.. అంటే కాదు. అర్హుడే. కాకపోతే తనపై కేసులు లేకుండా రాజకీయ ప్రాపకంతో తప్పించుకొని తన కిందివారిని బలిచేసి, ఇప్పుడు రెగ్యులర్ ఎస్ఈ కావడమే కాకుండా త్వరలోనే నార్త్ కోస్టల్ జోన్ సీఈగా కూడా పదోన్నతి పొందనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కూడా ఆశ్చర్యపోడానికి ఏమీ లేదు. ఎందుకంటే.. కూటమి ప్రభుత్వ పాలనలో లోకేష్ రెడ్‌బుక్‌లో ఉన్నవారిని మాత్రమే పక్కన పెడుతున్నారు తప్ప.. మిగిలిందంతా సేమ్ టు సేమ్. జూన్‌లో పదవీ విరమణ చేయనున్న నార్త్ కోస్టల్ జోన్ సీఈ రామ్‌గోపాల్ ఇప్పుడు ధవళేశ్వరం క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా ఉన్న డోల తిరుమలరావు చెప్పినట్టే బదిలీలు, పదోన్నతులు ఇస్తున్నారట. సుదీర్ఘ కాలం టీడీపీయేతర పార్టీతో సత్సంబంధాలు కలిగిన డోల తిరుమలరావును

- మిగతా చివరి పేజీలో




● ఎడిటోరియల్

# షర్బత్‌లోనూ మత విద్వేషపు విషమా!

ఆ పానీయం పేరు వినగానే మన శరీరమే కాదు.. హృదయమూ చల్లబడుతుంది. అదొక ప్రఖ్యాత శీతలపానీయం. వేసవి తాపాన్ని ఉపశమింపజేసే ఔషధం. దశాబ్దాలుగా మన దేశ సంస్కృతిలో భాగమైన తీయని అనుభూతి. దాని పేరే రూహ్ అఫ్జా. వేడుక ఏదైనా మన ఆతిథ్యానికి, ఆప్యాయతకు ఇది ఒక ప్రతీక. అన్నిటికీ మించి.. భారతీయుల మధ్య కులమతాల అంతరాల్ని తుడిచేసిన ఓ మధురమైన స్మృతి. అలాంటి ఈ స్వచ్ఛమైన పానీయాన్ని ఎవరైనా 'షర్బత్ జీహాద్' అంటే అది ఎంతటి దిగజారుడుతనం! వ్యాపార ప్రయోజనాల కోసం ఓ చల్లని పానీయానికి సైతం మతం రంగు పులిమి విద్వేషపు మంటల్లో మరిగించాలని చూడటం ఏహ్యమైన చర్య. 'వాళ్లు షర్బత్ అమ్ముతున్నారు, మనం అమాయకంగా తాగుతున్నాం. ఆ డబ్బుతో వాళ్లు మసీదులు, మదర్సాలు కడుతున్నారు. ఇది షర్బత్ జీహాద్' అంటున్నారు యోగాబాబా రాందేవ్. ఆయన తన పతంజలి గ్రూప్‌నకు చెందిన ఓ గూలాబీ షర్బత్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది ఎంత ద్వేషపూరితం? ఇంతకు మించిన నిరాధారమైన నిందారోపణ మరొకటుంటుందా? 'షర్బత్' అనేది ఏదీ ఓ మతానికీ సంబంధించినది కాదు. అది మన ఆహార పానీయాల్లో అంతర్భాగం. దాన్ని మత విద్వేష మంటల్లో మరిగించటం సమ్మతం కాదు. బాబా తన ఉత్పత్తులను ఎంత గొప్పగానైనా ప్రమోట్ చేసుకోవచ్చు. కానీ అది ఇతర బ్రాండ్లను కించపరిచేలా ఉండకూడదు. ఇందుకోసం నీచ వ్యాఖ్యలకు దిగజారడం, మతవిభజనకు సైతం తెగబడటం దుర్మార్గం, నీతిబాహ్యం. షర్బత్‌లో విద్వేషమనే విషం కలిపే కుతంత్రం. 'షర్బత్ జీహాద్' లాంటి పదాలు నేరుగా మత సామరస్యంపై ప్రభావం చూపుతాయి. ఒక సంస్థ వెనుక ఉన్న వ్యక్తుల మతం ఆధారంగా వారి ఉత్పత్తిపై నిందవేయడం వల్ల ఆ ఉత్పత్తి మాటెలా ఉన్నా మనుషుల మధ్య నమ్మకాలు దెబ్బతింటాయి. సమాజం చీలిపోతుంది. బాబా రాందేవ్ వ్యాఖ్యలు నిస్సందేహంగా కొందరి భావోద్వేగాలపై దాడి. మతాన్ని వాణిజ్య ప్రయోజనాలకు సాధనంగా వాడుకునే దుశ్చర్య. మతం అనే భావోద్వేగభరితమైన అంశాన్ని వ్యాపార రాజకీయాల్లోకి లాగడం మానవతా విలువలకు విరుద్ధం. ఒక దేశ సంస్కృతిలో కలిసిపోయే వస్తువులు అరుదుగా ఉంటాయి. అవి మతాన్ని మించిన మమకారాన్ని తెచ్చిపెడతాయి. రుహ్ అఫ్జా అలాంటి ఒక అపురూపమైన పానీయం. దాని పేరు ఉర్దూ భాషలో ఉండొచ్చుగానీ.. దాని రుచికి భాషాభేదాలు లేవు. అయినా మతం అంటగట్టడం హేయమైన చర్య. ఇలాంటి వికారపు వ్యాఖ్యలు ఈ బాబాకు అలవాటుగా మారాయి. అల్లోపతి వేస్ట్, మహిళలు బట్టలు లేకున్నా బాగుంటారు.. అంటూ గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వికార స్వభావానికి అద్దం పడతాయి. ఇప్పటికే ఆయన వ్యాపార ప్రకటనల తీరు పతంజలి సంస్థ విశ్వసనీయతను దెబ్బతీసింది. కోవిడ్ కాలంలో 'కోరోనిల్' అనే ఔషధాన్ని కరోనా నివారణిగా ప్రమోట్ చేయడం ప్రజల భయాలను సొమ్ము చేసుకోవడమే. వైద్య నిపుణులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, చివరికి డబ్ల్యూహెచ్‌వో సైతం ఈ ప్రకటనను తప్పు పట్టడంతో ఆయన తన ప్రకటనలను వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు కూడా పతంజలి సంస్థకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అసత్య ప్రకటనలు చేస్తే ఒక్కో ఉత్పత్తిపై కోటి రూపాయల జరిమానా విధించవచ్చని వ్యాఖ్యానించింది. ప్రజల ఆరోగ్యాన్ని లాభాల కోసం తాకట్టు పెట్టలేమని స్పష్టం చేసింది. అయినా ఆయన ఏ గుణపాఠమూ నేర్వలేదనడానికి తాజా వ్యాఖ్యలు ఓ ఉదాహరణ. స్వదేశీ ఉత్పత్తులు, సంప్రదాయ వైద్యం అంటూ యోగాను, ప్రజల విశ్వాసాలను తన వాణిజ్య లక్ష్యాలకు సాధనాలుగా వాడుకోవడం, మతవిద్వేషాలు రెచ్చగొట్టడం ప్రమాదకరమైన పోకడ. ఇప్పటికైనా రాందేవ్‌బాబా తన ప్రచార విధానాలను పునఃపరిశీలించాలి. తనకు గౌరవాన్ని, తన ఉత్పత్తులకు నమ్మకాన్నీ తెచ్చేది విద్వేష భాష కాదు.. విశ్వసనీయత మాత్రమే నని గుర్తించాలి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలంటే నిజాయితీ, పారదర్శకత, శాస్త్రీయ ధ్రువీకరణ తప్పనిసరి. కానీ అందుకు భిన్నంగా వ్యాపార ప్రచారాల కోసం మతాన్ని వాడుకోవడం ఎలా సముచితం? ఈ రకమైన ద్వేష భాష స్వచ్ఛమైన సహజీవనాన్ని అసహ్యంగా మార్చేస్తుంది. సమాజంలో విభజనకు దారితీస్తుంది. బాబా వ్యాఖ్యల లక్ష్యం వ్యాపారం మాత్రమే కాదు, ఒక మతం మొత్తంపై 'కస్టమర్ జీహాద్'గా ముద్ర వేయడం కూడా. పౌర సమాజం దీన్ని సహించకూడదు. రూహ్ అఫ్జా ఓ పానీయం మాత్రమే. మతం, భాష భూతద్దంలో కాకుండా దాన్ని అలాగే చూద్దాం. దాని రుచిని, చల్లదనాన్ని ఆస్వాదిద్దాం.

## ఉదారత చాటిన శ్యామ్ కుటుంబం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరానికి చెందిన ప్రముఖ సీనియర్ కెమెరామేన్ శ్యామ్ కుటుంబం ఉదారత చాటుకున్నారని, పేదల ఆకలి తీర్చిన శ్యామ్ కుటుంబానికి ధన్యవాదాలని, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ సోమవారం అన్నారు. స్థానిక గూనపాలెం చెరువుగట్టుకి చెందిన ప్రముఖ సీనియర్ కెమెరామేన్ శ్యామ్ కుటుంబం ఈస్టర్ పండుగ సందర్భంగా తన తండ్రి భైరి వరప్రసాదరావు పేరు మీదుగా స్థానిక నైట్ షెల్టర్‌లో అల్పాహారం అందించి ఉదారత చాటుకున్నారన్నారు. దీంతోపాటు నగరంలో అరసవల్లి కూడలి, డే అండ్ నైట్, పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జి, సూర్యమహల్ కూడలి, పాత బస్టాండ్‌లలో అన్నదానం చేశారన్నారు. కార్యక్రమంలో శ్యామ్ తల్లి భైరి జ్యోతి, భార్య లక్ష్మి, పిల్లలు, జ్యోతిర్మయి, జ్యోతిప్రసాద్, విజయప్రసాద్, సేవాసభ్యులు నంది ఉమా శంకర్, పొదుగు చరణ్, పెద్దపాడు సేవకులు బొట్టా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని రాక శుభ పరిణామం

(సత్యంన్యూస్, న్యూఢిల్లీ)



అమరావతి పునర్నిర్మాణం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏపీకి రావడం శుభ సూచికమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం అవుతారన్నారు. ప్రధాని పర్యటన కోసం ఆంధ్రా ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారన్నారు. ప్రధాని సహకారంతో అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని విమర్శించారు. కాబట్టి ప్రధాని సహాయ సహకారాలు అవసరమన్నారు. ప్రధాని అమరావతికి రావడం ద్వారా పెట్టుబడిదారుల్లో ప్రజల్లో కొత్త శక్తి ఉత్సాహం వస్తాయని,తద్వారా పెట్టుబడులు పెట్టడానికి అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తా రని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు.

## పెద్దింటి ముకుందరావుకు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్, జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావుకు ఆహ్వానం అందింది. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐ.ఎస్.వో గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్‌కుమార్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవిల సారథ్యంలో నాన్‌స్టాప్‌గా తెలుగు భాష, సాహిత్యం సంస్కృతి, కళలు, తెలుగు భాషా వైభవం ఇలా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో వ్యయప్రయాసలతో కార్యక్రమాలు సంస్థ నిర్వహిస్తూ వస్తుందన్నారు. వచ్చే నెల 10, 11తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను ఏలూరు పట్టణంలో మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నారన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి అనేక సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కవులు, రచయితలు, కళాకారులతో అనేకమంది నేడు ఈ ప్రపంచ సాహితీ సంబరాలకు శ్రీకారం చుట్టనున్నారన్నారు. శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఈ-వేమన ఉత్తరాంధ్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా ముకుందరావును డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, అధ్యాపకులు అభినందించారు.

## జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం జీడి పంటకు గిట్టుబాటు ధర హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. జీడీకి గిట్టుబాటు ధర లేకపోవడంతో జీడి రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిపప్పు ధర ఆకాశానికి అంటుతుంటే జీడి పిక్కల ధర పాతాళంలోకి పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీడికి గిట్టుబాటు ధర ప్రకటించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జీడికి గిట్టుబాటు ధర ఎందుకు ప్రకటించడం లేదని వారు ప్రశ్నించారు. జీడికి మద్దతు ధర ప్రకటించడం ద్వారా రైతాంగం జీడిపంటలు విస్తారంగా పండించడం ద్వారా జీడి పరిశ్రమలు అభివృద్ధి చెంది వేలాదిమంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. తద్వారా వలసలు నివారించవచ్చన్నారు. జీడిపిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16వేల రూపాయలు చెల్లించి ప్రభుత్వమే ఆర్.ఎస్.కె.ల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడిరైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. స్థానిక జీడిపిక్కలు కొనుగోలు పూర్తయ్యే వరకు విదేశీ జీడిపిక్కలను దిగుమతి నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎన్.గణపతి, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దూగాన చిన్నబాబుకు ధర్మాన పరామర్శ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా నాయకులు దుగాన చినబాబును మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పరామర్శించారు. చినబాబు భార్య దూగాన దుర్గాభాయి గత బుధవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ బంగ్లా దరిలోని ఆయన నివాసానికి ధర్మాన వెళ్లి దుర్గాభాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నబాబు, ఇతర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వెంకటేష్‌బాబు హీరోగా నటించిన "శత్రువు" సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యాక "వాహినీ స్టూడియో"లోని ఎడిటింగ్ రూంలో వర్క్ జరుగుతోంది. నేను అసోసియేట్ డైరెక్టర్, వి.ఆర్.ప్రతాప్ గారు కోడైరెక్టర్ (తరువాతి కాలంలో నువ్వొస్తావని,నిన్ను చూడాలని, గోరింటాకు వంటి చిత్రాలకు దర్శకుడు). ఓ రీల్ రష్ మార్క్ చేసి వచ్చి వరండాలో కూర్చున్నాము. అక్కడ కూర్చుంటే ఆ పక్కా ఈపక్కా వుండే ఫ్లోర్లలో షూటింగ్స్ జరుగుతుంటాయి కనుక బైట హడావిడి, తెలుగు,తమిళ,మళయాల భాషల నటీనటులు తిరగడం అంతా కనిపిస్తుంటుంది. కన్నుల పండుగే. సడెన్ గా ఓ అద్భుత దృశ్యం మా కంట పడింది. కుడివైపున వుండే మేకప్ రూంలనుండి .....రోజ్ కలర్ దుస్తులలో, ఎక్కడినుండో దిగివొచ్చిన దేవతలా ఒకామె నడిచొస్తోంది. అక్కడున్న పెద్దపెద్ద చెట్టు కొమ్మల మధ్యనుండి లేత ఎండ ఆమె మీద పడుతుండటంతో ఆమె దుస్తులపై కుట్టిన రోజారంగు పువ్వులకున్న చెంకీ మెరిసిపోతుంది. మా కళ్ళకు ఆమె తప్ప మిగతా పరిసరాలన్నీ ఒక్కసారిగా అవుట్‌ఫోకస్ అయిపోయాయి. ఇద్దరమూ ఆమేకదా అనుకున్నాం ఒకేసారి. అవును... ఇంకెవరు? మరెవరికుంటుంది అంతటి అందం....ఆమే... అతిలోకసుందరి "శ్రీదేవి" గారు.

– దేవీప్రసాద్.

# దివి నుంచి భువికి దిగిన అతిలోకసుందరి!



ఆమె ఎడమవైపున ఉండే ఫ్లోర్‌లోకి వెళ్ళిపోయారు. ఇలా దూరంనుండి కాదు దగ్గరకువెళ్ళి చూడాలి అనుకొని ఫ్లోర్ దగ్గరకు వెళ్ళి ఓపెన్ చేసివున్న చిన్న డోర్లోనుండి లోపలికి వెళ్ళాం. కొంత చీకటిగావుంది. ఓ ప్రక్క "దర్శకేంద్రుడు" కుర్చీలో కూర్చునివుంటే, ఎత్తుగావున్న ప్లాట్‌ఫాం పైన డాన్సర్స్ మూమెంట్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు. "ఆల్ లైట్స్ ఆన్" అనే ఓ అరుపుతో లైట్స్ అన్నీ ఒక్కసారిగా వెలగటంతో కళ్ళు జిగేల్‌మన్నాయి. బంగారు వర్ణంలో సెట్ అంతా మెరిసిపోతుంది. ఓ పక్క సీనియర్ కెమేరామెన్" విన్సెంట్"గారు ఏదో ఎఫెక్ట్ కోసం కెమేరా ముందు ఫిక్స్ చేసివున్న అద్దానికి వ్యూ ఫైండర్‌లోనుండి చూస్తూ వేలితో వ్యాస్‌లైన్ లాంటి జెల్ ఏదో రాస్తున్నారు. అప్పుడు చూశాం మెరూన్ రంగు కోటువేసుకొని వున్న సుప్రీం హీరో "చిరంజీవి" గారిని. శ్రీదేవిగారు మెరిసిపోతూ కెమేరా ముందుకొచ్చారు. విజిల్ సౌండ్‌తో స్పీకర్స్‌లో పాట మొదలైంది. "ప్రియతమా నను పలకరించు ప్రణయమా...అతిధిలా నను చేరుకున్న హృదయమా" ఒక్క రెండు రిహార్సల్స్ తరువాత టేక్. మొదటి టేక్ ఓకే. సింపుల్‌గా స్టైల్‌గావున్నాయి స్టెప్స్. సినిమా పేరు చెప్పేదేముంది "జగదేకవీరుడు అతిలోకసుందరి". ఆ పాట అయినవెంటనే వేరే ఫ్లోర్‌లో వేసిన మరో సెట్‌లో "ధినక్‌తా... ఛమక్కురో" అనేపాట షూట్ చేశారు. అప్పుడూ వెళ్ళి చూసేవాళ్ళం. అప్పటికి రెండురోజుల్లో "శ్రీదేవి"గారి చెల్లెలి పెళ్ళట. షాట్ గ్యాప్‌లో ఆమె ఎవరెవరికో పనులు పురమాయిస్తూ కొంచెం హడావిడిగా వుండేవారు. ఆ పాట జరుగుతున్నప్పుడు "చిరంజీవి"గారికి జ్వరం అని చెప్పుకుంటుంటే విన్నాము. ఆ డెడికేషన్‌కి ఆశ్చర్యపోయాము. నిబద్ధత కలిగిన కళాకారుల వ్యక్తిగత సమస్యలనో అనారోగ్యాలనో ఏ కెమేరా కన్నూ పట్టుకోలేదు. దర్శకేంద్రుడి మ్యాజిక్ అది. నావరకూ నాకుతెలిసి తెర పైన "చిరంజీవి"గారు ఎవరితో కలిసి డ్యాన్స్ చేస్తున్నా సరే నా దృష్టి అంతా ఎప్పుడూ యనొక్కరిపైనేవుండేది. ఈ ఒక్క సినిమా పాటలు మాత్రం మినహాయింపు. సినిమా పూర్తయ్యి బైటికొస్తే వర్షం దంచికొడు తుంది. అయినా ఎక్కడచూసినా గొడుగులు పట్టుకుని మ్యాట్నీ ఆటకోసం నిలబడ్డ జనం. నాటి సినీఅభిమానుల గుండెల్లో అప్పటికే జంఝామారుతంలా వీస్తోన్న "సుప్రీంస్టార్" గాలుల ముందు తుఫాన్ గాలులు వెలవెలబోయాయి.


"నడవగలిగివున్నప్పుడే మరణించేవాళ్ళు అదృష్టవంతులు" అని ఎవరో అన్నట్లు ఎక్కడో చదివినగుర్తు. ఆలెక్కన "శ్రీదేవి"గారు,మా "ప్రతాప్" గారు అదృష్టవంతులేనేమో.అయినా కళాకారులు వెళ్ళిపోయినా, వాళ్ళు సృష్టించిన కళ ఉండిపోతుందికదా.



(ఫోటోలో నా ప్రక్కన వున్నది మా "ప్రతాప్" గారే.)

(ఈ సినిమా స్టోరీలైన్(మూలకథ) రాసిన రైటర్"శ్రీనివాసచక్రవర్తి"గారు మొదటగా దానిని నాచేతనే ఫెయిర్‌కాపీ చేయించారు.) సినిమా రిలీజ్ ముందురోజు నేను తెనాలి వెళ్ళాను. రిలీజ్ రోజు ఉదయం ఆటకే బయల్దేరుతుంటే చల్లటి గాలులు ,చినుకులు మొదలయ్యాయి. గొడుగు వేసుకునిమరీ "రత్న టాకీస్" కివెళ్ళి సినిమా చూశాను. మొదటిపాట"అందాలలో అహోమహోదయం" పాటతోనే ప్రేక్షకుడు పెట్టిన డబ్బులకుసరిపడా వర్కవుట్ అయిపోయింది మిగిలిన సినిమా అంతా బోనస్సే అనిపించింది.

# పూరి @ 25.. కొడితే..మళ్ళీ దిమ్మతిరగాలి !





**టాలీవుడ్‌లో ఎంతమంది కొత్త దర్శకులు, కంటెంట్ ఉన్న దర్శకులు పరిచయమైనా కూడా ఆల్ టైమ్ ఒక ట్రెండ్ సెట్ చేసిన వారిలో పూరి జగన్నాథ్ ఒకరు. ఆయన కెరీర్‌ను ఓసారి వెనక్కి తిరిగి చూస్తే, ఎలాంటి హిట్స్ ఇచ్చారో తెలుస్తుంది. 2000లో బద్రీ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టిన పూరి, ఇప్పటివరకు 25 సంవత్సరాల సినీ ప్రయాణాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఫిలిం కమ్యూనిటీ నుంచి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.**

పూరి జగన్నాథ్ అంటేనే డిఫరెంట్ టేకింగ్, మాస్ డైలాగ్స్, హీరోకు పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేయడంలో స్పెషలిటీ. ఇడియట్, శివమణి, పోకిరి, బిజినెస్ మాన్, టెంపర్ వంటి సినిమాలు ఆయన స్టైల్‌కు నిదర్శనాలు. హీరో పవన్ కళ్యాణ్‌తో బద్రీ, మహేష్ బాబుతో పోకిరి, ఎన్టీఆర్‌తో టెంపర్ వంటి సినిమాలు పూరిని మరో లెవెల్ కు తెచ్చాయి. అయితే ప్రతి దర్శకుడి జీవితంలో హైస్, లోస్ ఉంటాయి. పూరికి కూడా అలాంటి ఫేజ్ వచ్చింది. 'లోఫర్', 'మెహబూబా', 'లైగర్' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో వర్కవుట్ కాలేదు. ముఖ్యంగా లైగర్ సినిమా భారీ బడ్జెట్‌తో వచ్చినా నిరాశ పరిచింది. కానీ పూరి ఈ డిజాస్టర్స్‌తోనూ వెనక్కి తగ్గలేదు. ఇప్పటివరకు వచ్చిన ప్రతి పరాజయం తర్వాత పూరీ ఎంట్రీ ఎలా ఇచ్చాడో తెలిసిందే, ఈసారి కూడా అదే జరుగుతుందని నమ్ముతున్నారు.

**పూరి స్క్రిప్ట్‌కి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆయన పాత్రల డిజైన్, స్క్రీన్ ప్లే, డైలాగ్స్‌కి ప్రత్యేక ఫాలోయింగ్ ఉంది. ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కూడా అభిమానుల్లో ఆసక్తి మొదలైంది. 25 ఏళ్ళ సినీ ప్రయాణంలో పూరి ఎన్నో విజయాలు, పరాజయాలను చూసారు. కానీ ప్రతిసారీ తిరిగి బౌన్స్ బ్యాక్ కావడం ముందుకు వెళ్లడం ఆయన ప్రత్యేకత. అదే ఆయనను మిగతా దర్శకుల కంటే భిన్నంగా హైలెట్ చేసింది. ఇప్పుడు ఈ క్రేజీ ప్రాజెక్ట్‌తో పూరి దిమ్మతిరిగేలా మళ్లీ బౌన్స్ బ్యాక్ అవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.**

'ఇస్మార్ట్ శంకర్' ముందు కూడా పూరి పరిస్థితి ఇలాగే ఉంది. కానీ ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. దాంతో పూరి మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. ఇక లైగర్ డబుల్ ఇస్మార్ట్ అనంతరం కూడా ఫామ్ తోలి వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం పూరి జగన్నాథ్, తమిళ స్టార్ నటుడు విజయ్ సేతుపతితో ఓ క్రేజీ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నాడు. ఇందులో టబు కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..




# నారాయణీయం.. ప్రథమ చైతన్యం!







**-పమిడికాల్వ మధుసూదన్**

ఐఐటీ ప్రవేశ పరీక్ష ఫలితాలొచ్చిన ప్రతిసారీ పత్రికల్లో ప్రకటన లు చదవడం ఒక బరువైతే అందులో విశేషణాలు, సాధించిన లెక్కలు అర్థం చేసుకోవడం మరో బరువు. కాళ్లకు తాడు కట్టుకుని బంగీ జంప్ చేస్తాము. అందులో సాహసం ఉంటుంది. ఆనందం ఉంటుంది. ఆశ్చర్యం ఉంటుంది. భయం ఉంటుంది. అలా ఈ ప్రకటనలను చదవడం, అర్థం చేసుకోవడం కూడా బంగీ జంప్ కంటే పెద్ద సాహసం. భయం.

ఉదాహరణకు శనివారం 2025 జెఈఈ మెయిన్ ఫలితాలొచ్చాయి. ఆదివారం షరామామూలుగా పుంఖానుపుంఖాలుగా కార్పొరేట్ కాలేజీల ప్రకటన లొచ్చాయి. ముసుగులో గుద్దులాట ఎందుకు? తెలుగు రాష్ట్రాల్లో కార్పొరేట్ కాలేజీలంటే చైతన్య-నారాయణ రెండే. అలా ఎందుకయ్యిందన్నది చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. అలా మన ఖర్మ కాలడంలో మన పాత్ర ఏమిటన్నది చెప్పడం కూడా ఈ వ్యాసం ఉద్దేశం కాదు.

**తల్లిదండ్రులు గర్వపడే క్షణం!**

ఒక్క శ్రీ చైతన్య హైదరాబాద్ నుండే ఓపెన్ కేటగిరీలో వంద లోపు పది ర్యాంకులతో శ్రీచైతన్యతో పోటీపడే సంస్థ లేదట. నిజమే ఒక్క హైదరాబాద్ నుండే ఇన్ని ర్యాంకులయితే మొత్తం దేశంలో ఉన్న శ్రీచైతన్యలనుండి ఇక ఎన్ని ర్యాంకులో! పేపర్లలో ఎన్ని పేజీలు అదనంగా వేసినా చాలవు కాబట్టి వేసి ఉండరు!

**ఫలితాలను శాసించిన నారాయణ!**

శ్రీచైతన్య పేజీలు తిప్పిన వెంటనే సృష్టిధర్మం ప్రకారం రావాల్సిన నారాయణ ప్రకటన ఉండనే ఉంది. టాప్ వందలో 30శాతం ర్యాంకులను నారాయణ శాసించిందట! ప్రకటన రాసినవారి కవి హృదయం ఏమో కానీ నిజమే! నారాయణ ర్యాంకులను ఓపెన్‌గా, పబ్లిగ్గా శాసిస్తున్నట్లే ఉంది!

తెలుగువారు ఇందుకు గర్వించవచ్చు. మిగతా దేశమంతా ఇందుకు కుళ్ళి కుళ్ళి ఏడవవచ్చు. ఒక ఫలితంలో ఒక సంస్థ నుండి ఎన్ని లక్షల మందిలో నుండి ఎన్ని వందలమంది వందలోపు ర్యాంకుల్లోకి రాగలిగారు? అన్నది అర్థరహితమైన ప్రశ్న. ఎన్ని లక్షల మంది ఏటా ఒక్కొక్కరు కనీసం రెండు లక్షల ఫీజు కడితే ఎన్ని వందల/వేల కోట్ల ఫీజవుతుంది? అన్నది మరింత అర్థం లేని ప్రశ్న. వందలోపు ఎండమావుల వెంటపడి ఏటా ఎన్ని లక్షల మెదళ్ళు మొద్దుబారిపోతున్నాయన్నది అడగకూడని ప్రశ్న. చదువుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకునే చైతన్యాలు ఎన్ని? అన్నది సానుభూతికి మనసులో కూడా అనుకోకుడని ప్రశ్న.


తల్లిదండ్రులు గర్వపడే క్షణాల్లో.. ర్యాంకులను శాసిస్తున్న క్షణాల్లో.. ఒకటి అంకె.. ప్రకటనల మయా దర్పణంలో ఒకటిగా కాకుండా వందగా, వేలుగా, లక్షలుగా ప్రతిబింబిస్తూ ఉంటుంది. అందులో మన పిల్లలు కనిపిస్తున్నట్లుగా ఉంటుంది. అంకెలన్నీ మాయమై ఒకటి ఒక్కటే ఒంటి స్తంభపు మేడమీద ఒంటరిగా నిలుచుని ఉంటుంది. ఆ ఒకటి నేను కాకపోతానా అని విద్యార్థికి అనిపిస్తూ ఉంటుంది. ఆ ఒకటి మా అబ్బాయి కాకపోతాడా? మా అమ్మాయి కాకపోతుందా? అని తల్లిదండ్రులకు అనిపిస్తూ ఉంటుంది.

**శతమానం అభవతి..**

వంద తరువాత ఉన్న అంకెలన్నీ అవమానభారంతో తమను తాము రద్దు చేసుకున్నాయి. కొందరు ఆత్మహత్య అన్నారు. కొందరు హత్యే అన్నారు. వంద దాటిన అంకెల ఉనికికోసం ఉవ్వెత్తున ఉద్యమాలు జరుగుతున్నాయి. పునరావాస కేంద్రాలు వెలుస్తున్నాయి. చెట్టంత ఎదగాల్సిన పిల్లలు సింగిల్ నంబర్, డబుల్ డిజిట్ స్వప్నాల్లో శిథిలమవుతున్నారు.

ఒకటి కానప్పుడు నువ్వు నువ్వు కాదు...వందలోపు లేనప్పుడు నీ నవ్వు నవ్వు కాదు. పేపర్లో నువ్వు ప్రకటన నంబరుగా మారనప్పుడు నీ చదువు చదువు కాదు...ఇంతకూ దీన్నేమంటారు?

**"నారాయణీయం".."ప్రథమ చైతన్యం"!**




## దళితుల సాంఘిక బహిష్కరణే కూటమి లక్ష్యమా?

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం**



దళితుల సాంఘిక బహిష్కరణే కూటమి నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని ఎస్సీ విభాగం సీనియర్ కార్యకర్త పొన్నాడ రుషి విమర్శించారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాడు స్వాతంత్రం రాక ముందు దళితుల పరిస్థితి ఎంత దీన స్థితి ఉందో, కూటమి ప్రభుత్వం నేడు ప్రత్యక్షంగా పితాపురంలో సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాకాలో జరిగిన దళితుల సాంఘిక బహిష్కరణ పాత చరిత్రను తిరగరాస్తుందన్నారు. ఒకపక్క దళితుల ఐక్యతని దెబ్బతీసే విధంగా ఎస్సీ వర్గీకరణ జరుగుతుంటే, కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం మల్లం గ్రామంలో పల్లపు సురేష్ అనే ఒక దళితుడికి జరిగిన అన్యాయం చూస్తుంటే కూటమి ప్రభుత్వం వారి పట్ల ఏ విధంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారన్నారు. గతంలో జగన్మోహనరెడ్డి నాయకత్వంలో దళితుల హక్కులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారన్న విషయం దళితులకు కూడా గుర్తుంటుందన్నారు. సమయం వచ్చినపుడు కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉంటారన్నారు.

## అభివృద్ధి మంత్రం కూటమిది అయితే.. వినాశన మంత్రం వైకాపాది

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



తెలుగుజాతిని నాశనం చేయాలని వైకాపా నాయకులు కంకణం కట్టుకుంటే తెలుగు జాతి అన్నింట అభివృద్ధి చెందాలని కూటమి నాయకులు కృషి చేస్తున్నారని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో ఉద్యోగాలు, అభివృద్ధి లేక రాష్ట్రం అట్టడుగు స్థాయికి పోయిందని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి భవిష్యత్తు తరాల జీవితాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు బంగారు బాటలు వేశారన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేస్తే వైకాపా వారు మాయమాటలు చెబుతున్నారన్నారు. ప్రజలు అన్నీ అందరిని గమనిస్తారని, ఎవరికి ఎప్పుడు ఎటువంటి స్థాయి, ఇవ్వాలో ఎటువంటి స్థితిలో నిలబెట్టాలో వాళ్ళకి బాగా తెలుసన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు బంగారు భవిష్యత్ కోసం మెగా డీఎస్సీ ఉపాధ్యాయ 16,347 పోస్టులను నోటిఫికేషన్ జారీ చేసిన కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీరాజ్ నిధులు పక్కదారి పట్టాయి

**(సత్యంన్యూస్, పాతపట్నం)**



కూటమి ప్రభుత్వ హయాంలో పల్లెలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశానికి పట్టు కొమ్మలు గ్రామాలేనని, అలాంటి గ్రామాలలో అభివృద్ధి, పారి శుధ్య పనులు చేపట్టేందుకు విడుదలవుతున్న నిధులు గ్రామపంచాయతీలకు చేరకుండా పక్కదారి పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోగా, కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు కూడా పక్కదారి పట్టించారని పలువురు సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం విడుదలైన నిధులను సైతం పక్కదారి పట్టించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలు ఇప్పటికే పలు సభల్లో సర్పంచులకు తగిన గౌరవం ఇస్తున్నామని పదేపదే చెబుతున్నారని, వారిని పూచిక పుల్లలాగా తీసివేసి ఒక్క రూపాయి కూడా నిధులు పంచాయతీలకు ఇవ్వడం లేదన్నారు.



ఈనెల 26న ముఖ్యమంత్రి జిల్లాలోని ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంకు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్, జాయింట్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ రెవిన్యూ అధికారులు, సిబ్బంది సోమవారం స్థల పరిశీలన చేశారు.


**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## విజయవంతమైన ఉచిత దంత వైద్య శిబిరం

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

మండలంలోని తోటాడ గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన ఉచిత దంతవైద్య శిబిరం విజయవంతమైంది, లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (నెహ్రూ యువ కేంద్ర అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో ఉషా డెంటల్ కేర్ సౌజన్యంతో ఈ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు స్నేహజ్యోతి మాట్లాడుతూ టూత్‌బ్రష్‌ని ప్రతి మూడు నెలలకు ఒకసారి మార్చుకోవాలని సూచించారు. గరుకుగా ఉండే టూత్‌బ్రష్‌ని ఉపయోగించవద్దని, ఇది చిగుళ్లకు నష్టం కలిగిస్తుందన్నారు. దంతాల ఆరోగ్యం కోసం పాలు, అన్నం, మాంసం, పండ్లు, చేపలు వంటి పోషకమైన ఆహారాన్ని తినాలన్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్.కృష్ణారావు మాట్లాడుతూ దంతాలను బ్రష్ చేయడానికి, ఫ్లాస్ చేయడానికి ముందు మీరు ఆరోగ్యకరమైన దంత సంరక్షణ పద్ధతులను అనుసరించాలన్నారు. సర్పంచ్ ప్రతినిధి బెండి జయరాం మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా దంతాలు మీద జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం జాతీయ బీసీ సంక్షేమ సంఘం యస్.సత్యనారాయణ, లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీధర్, గ్రామ పెద్దలు హనుమంతు బాలకృష్ణ, సీతారాం, రెడ్డి ఆనంద్, అచ్చుతరావు, తేజేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పాఠశాల యాజమాన్యం, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. అవసరమైన వారికి వైద్యుని సలహా మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని న్యూఢిల్లీలోని టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సథరన్ ట్రావెల్స్ ఎండి కృష్ణమోహన్, అంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఈశ్వరప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణతోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**


## టీడీపీ సభ్యత్వం ఉంటే భరోసా వారి వెంటే..



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

టీడీపీ సభ్యత్వం ఉంటే భరోసా వారి వెంటే ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళం పార్లమెంటు ఉపాధ్యక్షులు పీఎంజేబాబుకు ఎమ్మెల్యే గొండు శంకర్ సమక్షంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్డును అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కాంక్షించే ప్రతీ ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

## జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో చేపట్టిన జనసేన క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా క్రియాశీలక కార్యకర్తలకు సోమవారం సభ్యత్వ కిట్లను అందజేశారు. ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ ఈ కిట్లను జనసేన పార్టీ క్రియా వాలంటీర్లకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దేశ రాజకీయ పార్టీల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కార్యకర్తల కుటుంబాలకు భరోసా అందించేందుకు జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చారిత్రక కార్యక్రమం చేపట్టారని తెలిపారు. సభ్యత్వంతో కార్యకర్తలకు, వారి కుటుంబాలకు భరోసా ఉంటాయన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 12 లక్షల సభ్యత్వాలతో జనసేన పార్టీ సంస్థాగతంగా బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉండే విధంగా పవన్ కళ్యాణ్ సరికొత్తగా ఆలోచించి ఇన్సూరెన్సు పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ సభ్యత నమోదు ద్వారా ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు పరిహారంగా రూ.5లక్షల చెక్కులను పార్టీ ద్వారా అందజేసినట్లు తెలిపారు. ఈసారి ఈ సభ్యత నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమం నేరుగా కేంద్ర కార్యాలయ సిబ్బంది ద్వారా జరగడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాల జనసేనపార్టీ సమన్వయకర్తలు, జిల్లా ముఖ్య నాయకులు ,పట్టణ నాయకులు, మండల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, క్రియాశీలక వాలంటీర్లు, సభ్యులు పాల్గొన్నారు.















## బాలకృష్ణకు స్వరూప్ పరామర్శ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు టంకాల బాలకృష్ణ తండ్రి టంకాల రామారావు (69) శనివారం సాయంత్రం మృతి చెందారు. బాలకృష్ణ తండ్రి మృతిపై వైకాపా ఉత్తరాంధ్ర యువజన అధ్యక్షులు మెంటాడ స్వరూప్ సంతాపం తెలిపి విచారం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు 21, 22 డివిజన్లకు చెందిన పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో సీపాన రామారావు, హరి, డాక్టర్ సిమ్మన్న, డ్టాకర్ వాసు, పలువురు న్యాయవాదులు ఉన్నారు.

## డెంటల్ కాలేజీలో ఆత్మరక్షణ స్కిల్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక సాయి డెంటల్ కళాశాలలో మహిళలకు ఆత్మరక్షణ విద్యపై సోమవారం మెళకువలు నేర్పారు. ఓదెల–2, గుడ్‌బ్యాడ్ అగ్లీ, గేమ్ ఛేంజర్ వంటి సినిమాలకు స్టంట్‌మాస్టర్‌గా పని చేసిన జానీని తీసుకువచ్చి కళాశాలలో టెక్నిక్స్ నేర్పారు. ఈ సందర్భంగా షీటీమ్ సీఐ త్రినేత్రి కళాశాలలో చదువుతున్న వైద్యవిద్యార్థులందరితోను శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అక్రమాలకే సర్టిఫికేషన్.. డోలవారికి ప్రమోషన్!

(మొదటిపేజీ తరువాయి)

2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను తప్పించి మంత్రి అచ్చెన్నాయుడు నూజివీడు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ పరిధిలోకి మార్చారు. అయినా కూడా విశాఖపట్నం, రాజమండ్రి వంటి ప్రాంతాలు తిరుమలరావు చేతిలో ఉండటంతో నార్త్‌కోస్టల్ సీఈని ఆయన గ్రిప్‌లో పెట్టుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం జిల్లాలో నీటి పారుదల పథకాలపై సమీక్షిస్తున్న నేపథ్యంలో డోల తిరుమలరావు అంశం మరోసారి తెర పైకి వచ్చింది.

రెగ్యులర్ ఎస్ఈగా పదోన్నతి పొందడానికి డోల తిరుమలరావు ఎందుకు అర్హుడు కాదో చెప్పుకోవాలంటే ముందు పొందూరు మండలంలోని రెల్లిగెడ్డ ఆనకట్ట గురించి మాట్లాడుకోవాలి. అక్కడ రూ.10 కోట్లతో రెండు చోట్ల నిర్మించిన ఆనకట్టలు వరదలకు కొట్టుకుపోయాయి. వాటి నామరూపాలు కూడా మిగల్లేదు. ఎస్ఈ పి.రంగారావు, డీఈ రవీంద్ర హయాంలో జరిగిన ఈ నిర్మాణాలను క్వాలిటీ కంట్రోల్ ఈఈగా తిరుమలరావే ధ్రువీకరించారు. భేష్.. అని సర్టిఫికెట్ ఇచ్చారు. కట్ చేస్తే.. గెడ్డలోకి నీరు రాగానే ఆనకట్టలు తట్టుకోలేక కొట్టుకుపోయాయి. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపి దోషులుగా ముగ్గురిని గుర్తించినా, అందులో తిరుమలరావు తన పేరును తప్పించారు. గత వైకాపా ప్రభుత్వం డీఈ, ఏఈలను దోషులుగా గుర్తించి సస్పెండ్ చేసింది. కానీ క్వాలిటీ కంట్రోల్ ఈఈగా ఉంటూ నిర్మాణాలను ఆమోదిస్తూ సంతకం చేసిన డోల తిరుమలరావు జోలికి మాత్రం విజిలెన్స్ వెళ్లలేదు. అంటే.. రాజకీయ ప్రాబల్యం ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. క్వాలిటీ కంట్రోల్ ఈఈగా ఉన్న తిరుమలరావు పేరును ఈ కేసులో చేర్చి ఉంటే ఇప్పుడు రెగ్యులర్ ఎస్ఈగా పదోన్నతి వచ్చేది కాదని ఆ శాఖలోనే చెప్పుకుంటున్నారు.

### ప్రాజెక్టుల జాప్యానికి కారకుడు

క్వాలిటీ కంట్రోల్ ఈఈగా ఉన్న డోల తిరుమలరావు టీడీపీ హయాంలో మాజీ మంత్రి కళావెంకటరావు సిఫార్సుతో తోటపల్లి ఎస్ఈగా విధుల్లో చేరారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్మాన ప్రసాదరావు ద్వారా వంశధార ఎస్ఈగా అదనపు బాధ్యతలు చేపట్టారు. తోటపల్లి, వంశధార, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాకపోవడం వెనుక ఈయన వైఫల్యం ఉందని ఆశాఖ అధికారులే ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలను తప్పుదోవ పట్టించి కాలయాపన చేస్తూ వచ్చారన్న ఆరోపణలు తిరుమలరావుపై ఉన్నాయి. పలాస శివారు ఆయకట్టు భూములకు మూడేళ్లుగా నీరు అందించకుండా వివక్ష చూపుతున్నారని అప్పటి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులే తిరుమలరావుపై ఫిర్యాదు చేస్తే కనీసం పట్టించుకున్నవారు లేరు.

### షట్టర్ల కుంభకోణం సూత్రధారి

ఈయన లైజనింగ్ అధికారిగా ఉన్నప్పుడే 2008లో వంశధార షట్టర్ల కుంభకోణం జరిగింది. తన శాఖలోని 33 మంది వివిధ స్థాయిల అధికారులను సీఐడీ కేసులో దోషులుగా చేసి.. తాను మాత్రం తప్పించుకున్న ఘనత తిరుమలరావుకే దక్కింది. ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్న తర్వాత లష్కర్ల నియామకంలోనూ చేతివాటం చూపించినట్లు ఇప్పటికీ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ఉద్యోగుల పదోన్నతుల పేరుతో అమరావతిలో కూర్చొని పెద్దమొత్తం వసూలుచేసిన ఘనతా ఆయనకే దక్కిందన్న ఆరోపణలున్నాయి. 2023లో విశాఖ క్వాలిటీ కంట్రోల్ డివిజన్ పరిధిలో డీఈ, జేఈలను, జిల్లాలోని 23 మంది డీఈ, 13 మంది జేఈలను బదిలీ చేయించి, డీఈల బదిలీలకు రూ.30వేల నుంచి రూ.40వేలు, జేఈల బదిలీలకు రూ.15 వేల నుంచి రూ.20వేలు బహిరంగంగా వసూలు చేసినట్టు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.

### కేసు ఎదుర్కొంటున్న డీఈకే విజిలెన్స్ బాధ్యత

వంశధార ప్యాకేజీ 87, 88లో జరిగిన అవకతవకల విషయంలో కన్‌స్ట్రక్షన్ డీఈగా ఉన్న సత్యనారాయణపై విజిలెన్స్ కేసు నమోదు చేశారు. సత్యనారాయణను కాపాడుకోడానికి డోల తిరుమలరావే రంగంలోకి దిగారని ఆ శాఖలో అందరికీ తెలుసు. ఆ తర్వాత సత్యనారాయణను జలవనరుల శాఖ విజిలెన్స్‌లో డీఈగా నియమించిన తిరుమలరావు ఆయనతో కలిసి అనేక అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. నీరు–చెట్టు పథకానికి క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఈఈగా పనిచేసిన తిరుమలరావు వేల కోట్ల పనులకు క్లియరెన్స్ ఇచ్చారు. విచిత్రంగా వీటిపై వచ్చిన ఆరోపణలపై వైకాపా హయాంలో విచారణ అధికారిగా మళ్లీ తిరుమలరావునే నియమించారు. వంశధార రిజర్వాయర్‌లో 19.5 టీఎంసీల వరద నీటిని నిల్వ చేయడానికి పట్టిసీమ నుంచి మోటార్లు, పంప్‌లు తరలించి ఎత్తిపోతల పథకం నిర్మిస్తే మేలు జరుగుతుందని వైకాపా పెద్దలకు సలహా ఇచ్చిన ఘనత తిరుమలరావుదే. దీనివల్లే నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం నిలిచిపోయింది.

### తోటపల్లి గోడ కూలడానికి డోలే కారణం

2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తోటపల్లి రిజర్వాయర్‌ను ప్రారంభించిన వారం రోజుల్లోనే మూడువేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వాల్ కుప్పకూలిపోయింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంజినీరింగ్ అధికారుల అనుమతి పొందిన డిజైన్‌ను మార్చి సొంత పైత్యంతో గోడ నిర్మించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తిరుమలరావు సొంత డిజైన్‌తో నిర్మించడం వల్లే గోడ కూలి సుమారు రూ.3.50 కోట్ల ప్రజాధనం వృధా అయిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. దీన్ని తిరుమలరావు నుంచి రికవరీ చేయించాలని విజిలెన్స్ అధికారులు తేల్చి చెప్పారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో దీన్ని తొక్కిపెట్టి తప్పించుకున్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పుడు వంశధార ఎస్ఈ గా పని చేస్తున్న తిరుమలరావును అచ్చెన్నాయుడు బదిలీ చేయించినా, కళా వెంకటరావు జోక్యంతో తోటపల్లికి ఎస్ఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించారు.

### అధికారంలో ఉన్న సర్కారుకే భజన

తిరుమలరావును పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు కాపాడుకుంటూ వస్తున్నారు. తాను ఏ హోదాలో ఉన్నా ఉత్తరాంధ్ర స్థాయిలో అధికారుల బదిలీలు, ప్రమోషన్లు, పోస్టింగులను నిర్ణయించేవారని విమర్శలున్నాయి. శాఖలో ఒక కోటరీ ఏర్పాటుచేసి రాష్ట్రస్థాయిలో తన మాట చెల్లుబాటయ్యేలా చూసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, పెట్రోల్ బంకుల యజమానిగా ఉన్న ఆయన ఆరు నెలల క్రితం వరకు జలవనరుల శాఖలో ఒక క్షేత్రస్థాయి అధికారే. అర్హత లేకపోయినా పదేళ్లు ఎఫ్ఏసీగా ఎస్ఈ హోదా వెలగబెట్టి జలవనరుల శాఖను భ్రష్టు పట్టించారు. తనతో పాటు ఒకే సమయంలో విధుల్లో చేరినవారంతా ఈఈలు, డీఈలుగానే మిగిలిపోగా, ఈయన మాత్రం రాజకీయ సిఫార్సులతో అర్హత లేకపోయినా ఏళ్ల తరబడి దర్జాగా ఎస్ఈ కుర్చీలో కూర్చొని అధికారం అనుభవించారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే.. ఆ పార్టీకి చెందిన నాయకులను బంధుత్వంతో, ఉన్నతాధికారులను యూనియన్ పేరుతో మేనేజ్ చేస్తూ వచ్చినట్టు విమర్శలు ఉన్నాయి. మూడు, నాలుగు జోన్లకు చెందిన వారిని పక్కన పెట్టి రాష్ట్రస్థాయిలో ఇంజినీర్ల సంఘం ఏర్పాటుచేసి దానికి అధ్యక్షుడిగా తానే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు ఎదురుతిరిగిన వారిని శంకరగిరి మాన్యాలు పట్టించిన సందర్భాలూ ఉన్నాయి. తెలంగాణ క్యాడర్‌కు చెందిన హిరమండలం ఈఈ సుశీల్‌కుమార్ విషయంలో తిరుమలరావు వ్యవహరించిన తీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అర్థాంతరంగా బదిలీ చేసి సుశీల్‌కుమార్‌ను బలి తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.




## సమన్వయం తర్వాతా చల్లారని కుంపటి





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముందుగా ఊహించినట్టుగానే జిల్లా కళింగకోమటి అధ్యక్ష పదవికి సంబంధించి ఆ సామాజికవర్గ పెద్దలు ఒక అవగాహనకు రాలేకపోయారు. నగరం నుంచి కోరాడ హరిగోపాల్‌కే ఇవ్వాలని ఒక వర్గం సోంపేట నుంచి సానా షన్ముఖరావుకు ఇప్పటికే బోయిన గోవిందరాజులు అధ్యక్షుడిగా ఇప్పటికే ప్రకటించారని మరో వర్గం గొడవకు దిగడంతో ఆదివారం స్థానిక కళింగ వైశ్య కళ్యాణమండపంలో జరిగిన సమావేశం ఎటూ తేల్చలేక రసాబసాగా ముగిసింది. చివరకు ఎన్నికలకు సిద్ధం కావాలంటూ ఎవరికి వారే ప్రకటించుకొని సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అయితే ఈ నెల 27 తర్వాత ఇరువర్గాలను కూర్చోబెట్టి పదవుల పంపకం చేపడతారని తెలుస్తుంది. ప్రస్తుతం ఎన్నికలంటూ నిర్వహిస్తే సోంపేట నుంచి సానా షన్ముఖరావు, శ్రీకాకుళం నుంచి కోరాడ హరిగోపాల్, పెద్దిన మురళీకృష్ణలు బరిలో ఉంటున్నట్లు తేలింది. సోంపేట నుంచి షన్ముఖరావు పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టడంతో శ్రీకాకుళం నగరం నుంచి మద్దతు కూడగట్టిన హరిగోపాల్ వర్గంతో మాటల యుద్ధం జరిగింది. కొద్ది రోజుల క్రితం కోట బొమ్మాళిలో ఈ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు చేసిన ప్రతిపాదనకు కోరాడ హరిగోపాల్ సమ్మతి తెలిపారని, అందులో భాగంగానే సానా షన్ముఖరావును అధ్యక్షుడిగా ఉండాలంటూ మాటిచ్చారని, ఇప్పుడు శ్రీకాకుళం నుంచి హరిగోపాల్‌కు అవకాశం ఇవ్వాలని కోరడం సరికాదంటూ శ్రీకాకుళమేతర కళింగకోమటి నాయకులు పేర్కొనడంతో తామలా అనలేదని, శ్రీకాకుళంలో మిగిలినవారితో మాట్లాడి తమ నిర్ణయం చెబుతామన్నామని కోరాడ హరిగోపాల్ తరఫున శిల్లా మణి, చైతన్య ప్రభులు పేర్కొన్నారు. శ్రీకాకుళమంటే హరిగోపాల్ తప్ప మరొకరు లేరా అన్న ప్రశ్నకు పోటీ అంటే జరిగితే తానూ బరిలో ఉంటానని పెద్దిన మురళీ ముందుకొచ్చారు. వాడివేడిగా జరిగిన ఈ సమావేశంలో ఏ నిర్ణయమూ తీసుకోకుండానే వెనుతిరిగారు.

## నగర టీడీపీలో బీసీ రుణాల లొల్లి

* నాయకుల తీరుపై కార్యకర్తలు అసంతృప్తి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీ సబ్సిడీ రుణాల మంజూరుపై నగర టీడీపీలో లొల్లి ప్రారంభమైంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలను కాదని వైకాపా నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేశారని పలువురు సీనియర్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. నగరంలోని 48 డివిజన్ పరిధిలోని ఫాజుల్‌బాగ్ పేటలో 10 మందికి బీసీ 50 శాతం సబ్సిడీ రుణాలు మంజూరుపై తెలుగు తమ్ముళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. అదే డివిజన్‌లో సీనియర్ కార్యకర్తగా కొనసాగుతున్న తూతిక శంకరరావు టీడీపీ నాయకుల ఏకపక్ష నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు టీడీపీలో చేరిన అలపాన గోవిందరెడ్డి కుటుంబంలో ముగ్గురికి రుణాలు మంజూరు చేయడంపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గరికి ఏ ప్రాతిపదికన రుణాలు మంజూరు చేశారని తూతిక శంకరరావు టీడీపీ నాయకులను ప్రశ్నిస్తున్నారు. 1983 నుంచి పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలను విస్మరించి ఇటీవల పార్టీలో చేరినవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వారిచ్చిన సిఫార్సుల మేరకు బీసీ రుణాలు మంజూరు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైకాపా హయాంలో అనేక ఆటుపోట్లను ఓర్చుకొని పార్టీ కోసం పనిచేస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలను విస్మరించడం ఎంతవరకు సబబని స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నారు. డివిజన్ టీడీపీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న నాయకుడికి సమాచారం ఇవ్వకుండా వ్యవహారం నడిపించారని 'సత్యం'కు వివరించారు. డివిజన్ ఇన్‌ఛార్జి సిఫార్సులను పరిగణలోకి తీసుకోకుండా స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వైకాపా నాయకుల సిఫార్సులకు అనుకూలంగా బీసీ రుణాలు మంజూరు చేశారని ఆరోపించారు. 1983 నుంచి టీడీపీ తరఫున ఎన్నికల ఏజెంట్‌గా ఉంటున్నా గుర్తించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ కార్యకర్తగా తనకు జరిగిన అన్యాయంపై పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబునాయుడుకి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఎన్నికల ముందు పార్టీలో చేరినవారి కుటుంబంలో ముగ్గురికి బీసీ సబ్సిడీ రుణాలు కేటాయించి, టీడీపీ కార్యకర్తలను విస్మరించడంపై టీడీపీ ఎమ్మెల్యే పునరాలోచించాలని కోరుతున్నారు.

## వైఎస్ విగ్రహం ధ్వంసంపై స్వరూప్ ఆగ్రహం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బైరి గ్రామంలో మెయిన్ రోడ్డు నేషనల్ హైవేకి పక్కన ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని వైకాపా ఉత్తరాంధ్ర జిల్లాల యువజన అధ్యక్షులు మెంటాడ స్వరూప్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి దుశ్చర్యలను అధికారులు ఉపేక్షించకూడదని, ఈ విషయంపై కలెక్టర్, ఎస్పీ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్వరూప్ డిమాండ్ చేశారు.

## నీలకంఠేశ్వర ఆలయానికి సీసీ కెమెరాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)



శ్రీకాకుళం రూరల్ మండలం బట్టేరు గ్రామంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము ఆదేశాల మేరకు కర్రి చంద్రశేఖర్, కర్రి సురేష్ ఆధ్వర్యంలో వీటిని ఆలయానికి అమర్చారు. ఇటీవల పలు ఆలయాల్లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు కచ్చితంగా ఉండాల్సిందేనని ఎస్ఐ సూచించారు. దీంతో వీటిని ఏర్పాటు చేసినట్లు కర్రి బ్రదర్స్ తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.